క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో దత్త జయంతి



శాంతినగర్ : మండల కేంద్రంలోని జమ్ముల మడుగు కాలనీలో వెలసిన శ్రీ దత్తాత్రేయుని జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అలంపూర్: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజేయుడు శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన హనుమక్కకు రూ.16,500, సరోజమ్మకు రూ.18,000, మానవపాడు మండలం కలుకుంట్ల గ్రామానికి చెందిన పద్మావతికి రూ.15,000 చెక్కులు అందచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమం కోసం పని చేయడమే ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఆత్మలింగా రెడ్డి, సందీప్ కుమార్ రెడ్డి, అంజి, రాముడు, బీసన్న బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అయిజ: అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. శనివారం తెల్లవారు జామున పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో బొలెరో వాహనంలో బియ్యం తరలిస్తుండగా దానిని వెంబడించారు. ఈ నేపథ్యంలో ఉప్పల గ్రామ సమీపంలోని షెడ్డులో నిలువ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. వడ్డెపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన పరమేష్, భాస్కర్ గత కొంత కాలంగా పీడీఎస్ బియ్యాన్ని సేకరించి వాటిని మిషన్‌తో నూకలుగా మార్చి మద్యం తయారి ఫ్యాక్టరీలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రవల్లిలో..

ఎర్రవల్లి: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకున్నట్లు కోదండాపురం ఎస్సై స్వాతి శనివారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు.. వడ్డెపల్లి మండలం కొంకలకు చెందిన శ్రీకాంత్ తన వాహనంలో శుక్రవారం అర్ధరాత్రి బి.వీరాపురం నుంచి షాద్‌నగర్‌కు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. పెట్రోలింగ్ పోలీసులు బి.వీరాపురం శివారులో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం బొలెరోను పీఎస్‌కు తరలించి డ్రైవర్ శ్రీకాంత్, బియ్యం వ్యాపారి గోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

అలంపూర్: విద్యుత్ శాఖలో తాత్కాలిక ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్యే విజయుడుకు వారు వినతిపత్రం అందజేశారు. శనివారం ఎమ్మెల్యేను కలిసి గత రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 23,667 మందిని ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు తీర్మానించిన ఇప్పటికీ.. ఎలాంటి ఆర్డర్ రాలేదని, ప్రస్తుతం సర్వీస్ రూల్ అమలు చేస్తు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులు

గద్వాల క్రైం: అనుచిత వ్యాఖ్యలు చేసుకుని దుర్భాషలాడుకున్న సంఘటనలో ఒకరిపై ఒకరు పోలీసు స్టేషనలో ఫిర్యాదు చేసుకున్న ఘటన గద్వాల పట్టణంలో చోటు చేసుకుంది. మల్దకల్ మండలం మల్లెందొడ్డికి చెందిన చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డిలు కోర్టు ఆవరణలో తారసపడ్డారు. ఈ క్రమంలో ఇరువురు వారి గ్రామాల్లో రాజకీయాలు చేస్తున్నారని ఒకరిపై ఒకరూ దూషించుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరువురు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బంగారం చోరీ.. కేసు నమోదు

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లో 10 గ్రాముల బంగారం చోరీ అయిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. హమాలీ కాలనీకి చెందిన మల్లికార్జున్ కుటుంబ సభ్యులతో కలిసి కర్నూల్ జిల్లాకు శుక్రవారం వెళ్లాడు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం తెరచి ఉంది. బీరువాలోని 10 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించాడు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

శుచి.. రుచి.. ఆరోగ్యం

అడిషనల్ కలెక్టర్ నరసింగరావు

మానవపాడు: విద్యార్థులకు పరిశుభ్ర రుచికరమైన ఆహారంతో పాటు ఆరోగ్యం ముఖ్యమన్న ఉద్దేశంతో ప్రభుత్వం నూతన డైట్ మెనూ అందిస్తుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ నరసింగరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల, బాలుర వసతి గృహాల్లో నూతన మెనూ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నెలకు రెండుసార్లు మటన్, నాలుగు సార్లు చికెన్, ఉడికించిన గుడ్లు, ఫ్రైడ్ ఎగ్ అందించనున్నట్లు తెలిపారు. కాస్మోటిక్ చార్జీలు కూడా పెంచినట్లు పేర్కొన్నారు. మానవపాడులోని బాలుర వసతి గృహాల వెలుపల పందుల బెడద ఉందని వాటిని దూరంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాలికల వసతి గృహాలకలె ప్రహరీ, మూత్రశాల ఇబ్బందులు ఉంటే త్వరలోనే సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, ఎస్ఐ చంద్రకాంత్, వార్డెన్ పుష్పలత, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి..

ఎర్రవల్లి: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి శ్యాం సుందర్ అన్నారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (అయిజ)లో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదే విధంగా మండల పరిధిలోని వల్లూరు ఎస్సీ వసతి గృహంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రంగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతి గృహంలో..

మల్దకల్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ టంగుటూరి శ్రీను, ఎంఈఓ సురేష్, డీటీ ఝాన్సీరాణి, ఎస్సై నందికర్, ఎంపీఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ నరసింగరావు



ఎర్రవల్లిలో మాట్లాడుతున్న డీపీఓ శ్యాం సుందర్



ధరూరు బీసీ బాలుర వసతి గృహంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్రావు

నాణ్యమైన విద్యతో పాటు భోజనం..

ఉండవెల్లి: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటూ భోజనం అందించాలని లక్ష్యమని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శనివారం మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విమల పాల్గొన్ని ప్రారంభించారు. నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో జిల్లా ఇరిగేషన్ అధికారి శ్రీనివాసులు కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్ఎంలు దేవానందం, ఎలిజబిత్ సుహాసిని, పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి, పరమేష్ రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

హాస్టల్‌లో కొత్త మెనూ ప్రారంభం..

శాంతినగర్ : వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం ఎస్సీ హాస్టల్‌లో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త మెనునూ శనివారం అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ హాస్టళ్లలో పౌష్టికాహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, హాస్టల్ వార్డెన్ హేమచందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి..

కేటీదొడ్డి: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తహసీల్దార్ సాహెదా బేగం అన్నారు. శనివారం కేటీదొడ్డి మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. డైట్, కాస్మోటిక్స్ చార్జీల వివరాలు తెలిపేలా చార్ట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి..

గట్టు : ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళీ శాఖ ఏడీ గోవిందయ్య అన్నారు. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం పెంచిన మెస్ చార్జీల అమలును అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్య అతిథులుగా గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, ఎంపీడీఓ చెన్నయ్య, ఎస్ఐ మల్లేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం నర్సింహులు, ప్రిన్సిపాల్ శోభారాణి, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

అయిజ: నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ జ్యోతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ హాస్టళ్లలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ఎంపీడీఓ వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ టాటా బాబు , ఎస్సై విజయ్‌భాస్కర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన మెనూ అమలు చేయాలి..

ధరూరు : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో నూతన మెనూ కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకట్రావు, ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు, గుడ్డెందొడ్డి గురుకుల పాఠశాలలో జిల్లా మత్స్య శాఖ అధికారిణి షకీలా భాను ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కిచెన్, స్టోర్ రూమ్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో వార్డెన్ నర్సింహులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారంతోనే ఆరోగ్యం..

ఇటిక్యాల : విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందినప్పుడే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ నరేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కేటీదొడ్డిలో కామన్ డైట్ ప్లాన్ సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సాహెదాబేగం



పుల్లూరు సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు



గట్టు గురుకులంలో స్టోర్ రూంను పరిశీలిస్తున్న అధికారులు



అయిజలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి



మల్దకల్ ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

నిలిచిన ధాన్యం కొనుగోలు



కొనుగోలు లేకపోవడంతో పేరుకుపోయిన వరి ధాన్యం రాసులు

అయిజ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ గన్నీ బ్యాగులు (గోనె సంచులు) లేకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతుంది. మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో గత 15 రోజుల క్రితం ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది. సింగిల్ విండో కార్యాలయం వారు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గన్నీ బ్యాగులు లేక కొనుగోళ్లు నిలిచిపోయి వరి ధాన్యం గుట్టలు గుట్టలుగా పేరుకపోయింది. దీంతో వరి ధాన్యం విక్రయించి వచ్చిన డబ్బుతో అవసరాలు తీర్చుకోవాలనే రైతులకు నిరాశే ఎదురైంది. ప్రతిరోజు వందల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వస్తుందని, గన్నీ బ్యాగులు లేకపోవడంతో వరి ధాన్యం కొనుగోలు చేయలేకపోతున్నామని సింగిల్ విండో ప్రెసిడెంట్ తెలిపారు. ప్రస్తుతం 8వేల బస్తాలు ఉన్నాయని, వాటిలో చినిగిపోయినవి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. సివిల్ సప్లై వారు బ్యాగులు సప్లై చేస్తేనే కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.



గోదాంలో గుట్టలుగా పడివున్న చినిగిపోయిన గన్నీ బ్యాగులు

రోడ్డు నిర్మాణ జాప్యంతో ఇబ్బందులు



ధరూరులో గట్టు వెళ్లే మార్గంలో ఒక వైపు మాత్రమే వేసిన సీసీ రోడ్డు

ధరూరు : ధరూరు– గట్టు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల క్రితం ధరూరులో గట్టు బస్టాండ్ నుంచి మసీదు వెళ్లే దారి వరకు కేవలం ఒక వైపు మాత్రమే సీసీ రోడ్డు వేశారు. క్యూరింగ్ పనులు కూడా దాదాపుగా పూర్తైనప్పటికీ మరో వైపు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంలో జాప్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండు మండలాల వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలోనూ ఇదే సమస్య ఉంది. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎవరో పట్టుకున్నారు.. ఎందుకో వదిలేశారు

మానవపాడు : మండలంలోని జాతీయ రహదారి–44పై శనివారం పెబ్బేరు వైపు నుంచి కర్నూల్ వైపుగా వెళ్తున్న వాహనంలో ఆవులను తరలిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మానవపాడు శివారు ప్రాంతంలో పట్టుకున్నారు. అనంతరం తిరిగి వదిలేశారు. ఎందుకు పట్టుకున్నారు... ఎందుకు వదిలేశారో అని మండల కేంద్రంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ చంద్రకాంత్‌ను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

కారు బోల్తా.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ అటాచ్ రోడ్డుపై కారు బోల్తా పడి ఒకరికి స్వల్ప గాయాలైన ఘటన శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు కారులో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు వెళ్తుండగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు బోల్తా పడినట్లు తెలిపారు. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న చేతన్ స్వల్పంగా గాయపడ్డాడు. అతడిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మానవపాడు: మండల కేంద్రంలో స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు మిత్రులు. మండల కేంద్రంలోని కురవనారాయణ కుమారుడు మధు గతవారం కర్నూల్ జిల్లా కేసీ కెనాల్‌లో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటంతో 1996 బ్యాచ్ పదో తరగతి మిత్రులు సాధిక్, ప్రసాద్, రంగన్న రూ.17,200 ఆర్థిక సాయాన్ని మధు కుటుంబ సభ్యులకు అందజేశారు. మధు మృతిపై సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎస్ కాల్వకు అడ్డుకట్ట

మానవపాడు: మండల కేంద్రంలోని ఆర్డీఎస్ కాలువ మార్గంలోని డీ– 30, 5వ మినీ కాలువకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డుకట్ట వేశారు. దీంతో డీ– 30 కాలువ నుంచి మానవపాడు, చెన్నిపాడు గ్రామ శివారు ప్రాంతాల్లో ఉన్న 6, 7 మినీ కాలువలకు చుక్కనీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిరప పంట పూత, కాయ దశలో ఉందని పంటకు సకాలంలో నీరు అందకపోతే నష్టపోతామని పేర్కొన్నారు. పంట పొలాలకు నీరు అందిచే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మానవపాడులో డీ-30 కాల్వకు వేసిన అడ్డుకట్ట

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

వీపనగండ్ల: గ్రామాల్లో గర్భిణులు, పసి పిల్లలు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం రంగవరం, కొర్లకుంట, సంపత్‌రావుపల్లి గ్రామాల్లో పలువురికి నెలవారీ టీకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు వృథా చేసుకోవద్దని అంగన్‌వాడీ టీచర్‌లు చంద్రకళ, వెంకటేశ్వరమ్మ, ప్రసన్న, ఏఎన్ఎం సునంద, ఆశా కార్యకర్త జయశ్రీ తెలిపారు. చిన్నారులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.

ఇరకాటం.. ఇక్కట్లు



రాజోళి మార్గంలో లోబ్రిడ్జి కింద ఇరుక్కున్న సుబాబుల్ లారీ(ఫైల్)

- భారత్ మాలలో నిర్మించిన లోబ్రిడ్జిలతో ఇబ్బందులు
- పంట లోడుతో లారీలు వెళ్లలేని పరిస్థితి
- అమ్మకాల సీజన్ కావడంతో రైతుల గగ్గోలు

రాజోళి: రవాణాకు పెద్దపీట వేసేందుకు భారత్ మాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణం చేపట్టింది. కానీ రహదారులు నిర్మించే సంస్థలు, వారికి కాంట్రాక్టులు ఇచ్చే ప్రభుత్వాలు చేసే చిన్న చిన్న తప్పిదాలతో క్షేత్ర స్థాయిలో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోబ్రిడ్జిల నిర్మాణంలో అవస్థలు..

భారత్‌మాల రహదారుల్లో నిర్మించిన తక్కువ ఎత్తుతో నిర్మించిన లోబ్రిడ్జిలతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. బ్రిడ్జి ఎత్తు 16 ఫీట్లు దాకా నిర్మించగా.. పంట లోడుతో వెళ్లేటపుడు లారీలు ఇరుక్కపోయి ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజోళి, ముండ్లదిన్నె, తూర్పుగార్లపాడు మార్గంలో ఎక్కువగా రైతుల ధాన్యం తరలిస్తుంటారు. రాజోళి నుంచి శాంతిగనర్‌కు లోడ్‌తో వెళ్లాలంటే బ్రిడ్జి కింద గుండా వెళ్తున్న లారీలు బయటకు వచ్చే వరకు ఆందోళన తప్పడం లేదని రైతులు పేర్కొన్నారు. సుబాబుల్, ధాన్యం, పత్తి లోడ్‌తో వెళ్లేటపుడు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిపారు. రాజోళి నుంచి శాంతిగనర్‌కు రావాలంటే తుమ్మిళ్ల మీదుగా మాన్‌దొడ్డి చేరుకుని వెంకటాపురం మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. తుమ్మిళ్ల, పెద్ద తాండ్రపాడు, ముండ్లదిన్నె, అశోక్‌గనర్ క్యాంపుల నుంచి ధాన్యం లారీలు రాక చిన్న చిన్న వాహనాల్లోనే ధాన్యం తరలిస్తున్నారు. దీంతో అదనంగా రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో మంది దృష్టికి తీసుకెళ్లాం..



లోబ్రిడ్జిల ఎత్తు పెంచకపోతే వచ్చే సమస్యలు వివరిస్తూ అఖిల పక్షం ఆధ్వర్యంలో రైతులతో కలిసి అధికారులు, రాజకీయ నాయకులకు వినతులు ఇచ్చాం. అయినా కూడా వారు నిర్ణయించుకున్న ఎత్తులోనే నిర్మాణం చేపట్టారు. దీంతో రైతులు నేడు పంట తరలించేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– సంజీవ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు, రాజోళి

వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు..



గ్రామాల్లో ప్రస్తుతం పత్తి, వడ్లు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కానీ లోబ్రిడ్జి తక్కువ ఎత్తులో నిర్మించడం వల్ల వ్యాపారులు ఆ మార్గంలో రావాలంటే ఆసక్తి చూపడం లేదు. ధాన్యం రవాణా చేసే క్రమంలో బ్రిడ్జి కింద గుండా వెళ్లాల్సి ఉంటుంది. అందులో ఇరుక్కుపోతే నష్టం ఎవరు భరించాలి అంటున్నారు.

– మహేష్, రైతు, ముండ్లదిన్నె

పట్టించుకోని నాయకులు, అధికారులు..

లోబ్రిడ్జిల నిర్మాణం జరిగేటప్పుడు ఎత్తు పెంచాలని లేకుంటే దాని వలన కలిగే నష్టాలను వివరిస్తూ మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్‌కు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, ప్రజా ప్రతినిధులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. 20 అడుగుల ఎత్తులో నిర్మించాలని విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదని దీంతో నిత్యం అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు.